శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కామాక్షితాయి సేవలో ఆర్టిసి చైర్మన్



**బుచ్చి నవంబర్ 12 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయిని ఎపిఎస్ఆర్‌టిసి డిపార్ట్మెంట్ స్టేట్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జిల్లా దేవాదాయశాఖ అధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, వారిని స్వాగతించారు. వారి గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ప్రసాదాలు అందజేశారు.

## కొండబిట్రగుంటలో భక్తుల రద్దీ

**బిట్రగుంట, నవంబరు 12 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం కార్తీక మాసం సందర్భంగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా దేవాలయ సందర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం అనంతరం ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు.

## జలదంకిలో భారీ వర్షం

**జలదంకి, నవంబర్12, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ప్రభావంతో జలదంకి మండలంలో వర్షాలు దంచికొడుతున్నాయి. శుక్రవారం రాత్రినుంచి మొదలైన జల్లులు అంతకంతకూ పెరుగుతూ శనివారం భారీవర్షం కురిసింది. దీంతో పొలాలలో ఎక్కడచూసిన నీరు తాండవమాడుతున్నాయి. జలకళతో కయ్యలు కలకళ లాడడంచూసిన రైతాంగం దుక్కులకు దిగారు. ఇప్పటికే నారుమడులు సిదంచేసిన అన్నదాతలు నారేతలకు సమాయాత్తం అవుతున్నారు. వాగులు వంకలు ప్రవహిస్తున్నాయి. ఆయాగ్రామాలలోని చెరువులలో నీరుచేరుతుంది. ఇక ఈఏడాది సాగునీరుకు ఎలాంటిడోకా వుండదని రైతన్నలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఈవానలు ఒకటి, రెండు రోజులు కొనసాగుతాయన్న వాతావరణశాఖ ప్రకటనలతో అందరూ కషీగావున్నారు. కుంగిన రోడ్... మండలంలోని 9వమైలునుంచి చావమాదల వైపువెళ్ళే రోడ్ కమ్మవారిపాళెం నాయుడుచెరువు సమీపంలో కుంగింది. గతంలోకూడా అదేప్రాంతంలో పెద్దపెద్ద నెర్రెలు ఏర్పడి కృంగిపోయి దెబ్బతింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ప్రమాదాల బారీన పడ్డ సందర్భాలు వున్నాయి. ఇటీవల ఆమార్గం తారురోడ్ వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరోసారి నెర్రెలుబారి కృంగింది. దీంతో ఆమార్గంలో వెళ్ళే ప్రయాణీకులు భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు. అధికారులు దీనిని గమనించి దెబ్బతిన్న రోడ్‌ను సరిచేసి పటిష్టతకు చర్యలు తాసుకోవాలని కోరుచున్నారు.

## ఎన్‌సిసి ట్రైనింగ్ క్యాంప్‌ని సందర్శించిన కమాండెంట్ కల్నల్ జయకుమార్



**కావలి, నవంబరు 12 ప్రభాతవార్త** కావలి సమీపంలోని ముసునూరు ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూలులో జరుగుతున్న కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌ను శనివారం గుంటూరు గ్రూప్ కమాండెంట్ కల్నల్ జయకుమార్ సందర్శించారు. రిపబ్లిక్ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న క్యాడెట్స్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆయన పలు సూచనలు ఇచ్చి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమాశంకర్ వైద్యపరమైన సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ ప్రవీణ్‌కుమార్ పాండే, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ సునీల్‌కుమార్, సుబేదార్ మేజర్ రాజేష్, మిలటరీ సిబ్బంది, ఎయంవోలు పాల్గొన్నారు.

## కావలిలో వర్షానికి చెరువుల్లా తలపిస్తున్న రోడ్లు





**కావలి, నవంబరు 12 ప్రభాతవార్త** కావలి పట్టణంలో శనివారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి కావలి రోడ్లు చెరువుల్లా తలపిస్తున్నాయి. ఏది గుంటో, ఏది రోడ్డో తెలియక పాదచారులు, ద్విచక్రావాహనదారులు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ వర్షానికి వర్షపు నీటితో పాటు మురికి కాలువల్లోని మురికినీరు పొంగిపొర్లి రోడ్ల మీదకు పరుగులు తీసింది. దీంతో పలు రోడ్లు దుర్గంధభూయిష్ట వాసనలతో ప్రజలు తట్టుకోలేకపోయారు. కావలి పట్టణ నడిబొడ్డున వున్న కావలి శివాలయం రోడ్డు, కోర్టు సెంటర్ రోడ్డులలో మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోయాయి. అలాగే పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు గుంతల మయంతో చెరువుల్లా తలపించింది. పాదచారులు, ద్విచక్రవాహనదారులు అధికారుల పరిపాలన తీరుతెన్నుల్ని దుయ్యబట్టారు.



## బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 12, ప్రభాతవార్త:** బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయనున్నట్లు వేదాయపాళెం పోలీసుస్టేషన్ సీఐ కె.నరసింహారావు శనివారం తెలిపారు. స్థానిక పోలీసుల వివరాల మేరకు నిందితుడు కొత్తూరులోని ఒవెల్ స్కూల్‌లో పీఆర్‌వోగా పని చేస్తున్నారని, సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు వెంటనే పోక్సో కేసు, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపనున్నట్లుగా వెల్లడించారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు కూడా పేర్కొన్నారు. ఎవరైనా మైనర్ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే సహించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు.

# వేడుకగా కార్తీక మాస లక్ష దీపోత్సవం





**నెల్లూరురూరల్, నవంబరు12 ప్రభాతవార్త** విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాస లక్ష దీపోత్సవ కమిటి నిర్వహణలో నగరంలోని విఆర్ కళాశాల మైదానంలో శనివారం కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమం వేడుకగా సాగింది. రాజ్యసభసభ్యులు, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, టిటిడి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ప్రత్యేక శ్రద్ధతో ఈదీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మూడు రోజులుపాటూ కొనసాగే ఈదీపోత్సవ కార్యక్రమాల్లో రెండో రోజు కార్యక్రమంలో భాగంగా ఉదయం 108మంది దంపతులచే శ్రీమహావిష్ణువుకు లక్ష తులసిపూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం విశేష రుద్రహోమ కార్యక్రమం జరిగాయి. ఉత్తర భారత టిటిడి సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతుల పర్యవేక్షణలో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ కార్తీక దీప వైభవం ప్రవచనాలు చేశారు. ప్రవచనాల అనంతరం మహావిష్ణువుకు 1008 కమలములతో సహస్ర నామార్చన, మహాదేవునికి విశేష అభిషేకం, ప్రత్యేక హారతులు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో దీపోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి భగవంతుని కృపకు పాత్రులయ్యారు.

**మంత్రి కాకాణి ప్రత్యేక పూజలు:** కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమంలో శనివారం రాష్ట్ర వ్యవసాయ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్తీక మాస విశిష్టతను వివరించారు. శోభాయమానంగా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దీపోత్సవాన్ని నిర్వహిస్తోన్న విపిఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కొనియాడారు. మాజీమంత్రి, నెల్లూరు సిటి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు హాజరై విశేష పూజలు చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి కోటారెడ్డి దంపతులు దీపోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. లక్ష దీపోత్సవ కమిటి సభ్యులు కంజర్ల భాస్కరశర్మ, మద్దిన విశ్వనాథ్, అమంచర్ల వెంకటప్రభాకరశర్మ, సునిల్‌కుమార్, విజయసారది, తిరుపాల్‌రెడ్డి, పవన్‌స్వామి తదితరులు ఉత్సవ ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు.

# విద్యార్థినిపై స్కూల్ పిఆర్ఓ అసభ్య ప్రవర్తన





**నెల్లూరురూరల్, నవంబరు12 ప్రభాతవార్త** చిన్నారులకు విద్యాబుద్దులు నేర్పించి వారిని మంచి మార్గాన తీర్చిదిద్ది భవిష్యత్తుకు బంగారు బాట వేయాల్సిన కొన్ని ప్రాథమిక విద్యాలయాలు ప్రస్తుతం అందుకు భిన్నంగా నడుస్తున్నాయి. విద్యాలయమే సభ్యసమాజం తలదించుకునేలా కీచక నిలయం కావడం సర్వత్రా చర్చనీయాంశమయింది. రూరల్ పరిధిలోని కొత్తూరు స్థానిక విజయలక్ష్మినగర్‌లో నెలకొన్న ఒవెల్-14స్కూల్‌లో శనివారం వెలుగులోకి వచ్చిన చిన్నారిపై స్కూల్ పిఆర్వో అసభ్య ప్రవర్తన సంఘటన సంచలనానికి కేంద్రబిందువయింది. బాల్య విద్యాభ్యాసానికి సంబంధించి అటు తల్లిదండ్రులు, ఇటు సభ్యసమాజాన్ని ఈసంఘటన ఆలోచింపజేసింది. పోలిసులు, తల్లింద్రుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... ఒవెల్ స్కూల్‌లో బ్రహ్మానందనాయుడు అనే వ్యక్తి పిఆర్ఓగా పనిచేస్తున్నారు. ఆయన స్థానిక పాఠశాల్లో నాలుగో తరగతి చదువుతోన్న మైనర్ బాలికపై కన్నేశారు. గత రెండు నెలలుగా ఆచిన్నారిని వేధించడం మొదలుపెట్టారు. ఈమేరకు విద్యార్థిని తల్లిదండ్రులు సమస్యను స్కూల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళారు. విచారించి, న్యాయం చేయడంలో స్కూల్ యాజమాన్యం ఘోరంగా విఫలమయింది. ఆచిన్నారి గత రెండ్రోజులుగా బడికి వెళ్ళక పోయినా విద్యార్థిని ఎందుకు రావడం లేదన్న అంశాన్ని యాజమాన్యం కూలంకుషంగా విచారించలేక పోయింది. ఈనేపథ్యంలో శనివారం విద్యార్థిని తల్లిదండ్రులు స్కూలు వద్ద ఆందోళన వ్యక్తం చేయగా సహచర విద్యార్థుల కుటుంబసభ్యులు, తల్లిదండ్రులు స్పందించారు. యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. నిందితునికి దేహశుద్ధి చేశారు. పోలీసులకు అప్పగించారు. పాఠశాలపై దాడి చేశారు. అద్దాలు తదితరాలను ద్వసం చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు రంగప్రవేశం చేశాయి. స్కూలు గుర్తింపును రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు రాస్తారోకో చేశారు. అయిదో నగర పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈమేరకు విద్యార్థి సంఘాల నాయకులు, పోలీసులకు మధ్య తోపులాటలు జరిగాయి. ఆందోళన కారులను తొలగించేందుకు పోలీసులు ప్రయత్నించారు. సంఘటనకు కారణమయిన పాఠశాలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

**ఫ్యాక్టో చట్టం కింద కేసు నమోదు:** ప్రయివేటు పాఠశాల్లో జరిగిన సంఘటనకు సంబంధించి ఫ్యాక్టో చట్టం కింద కేసు నమోదు చేశామని అయిదవ నగర సిఐ నరసింహారావు ప్రకటించారు. నిందితుణ్ని జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించామని, పూర్తిస్థాయిలో విచారించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

**విద్యాశాఖకు నివేదిక: ఎంఇఓ**

ఘటనకు సంబంధించిన పూర్తి విచారణను చేపట్టామని నెల్లూరు మండల ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారి తిరుపాలు తెలిపారు. ఈమేరకు విచారణ నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి పంపుతామన్నారు. ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. సోమవారం స్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. ప్రయివేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాల్సిందేనన్నారు. అలాకాని పక్షంలో వారి గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు.

# పట్టుదల, ఆత్మవిశ్వాసం ప్రధానం




**కోవూరు, నవంబరు12 ప్రభాతవార్త :** పట్టుదల .. ఆత్మ విశ్వాసం.. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగితే తప్పనిసరిగా ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని, దీనికి కావల్సింది పట్టుదల అని రిటైర్ట్ ఐఏఎస్ అధికారి బి. లక్ష్మీకాంతం అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎస్అండ్ హెచ్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ ప్రథమ బీటెక్ విద్యార్థులకు మల్టిబుల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాకు చెందిన ప్రముఖ మనస్తత్వ శాస్త్రజ్ఞుడు హోవార్డ్ గార్డినర్ మానవుని మేదస్సును 8 రకాలుగా విభజించారన్నారు. ప్రతి ఒక్కరిలోనూ నిగూడంగా కొన్ని ప్రతిభా నైపుణ్యాలు దాగి ఉంటాయని , వాటిని గుర్తించి ప్రణాళికాబద్ధమైన కృషితో ముందుకు సాగాలన్నారు. ఇందుకు ఏకాగ్రత పెంపొందించుకున్నప్పుడే సంపూర్ణమైన వ్యక్తిత్వ వికాసం సాధించడం సాధ్యమవుతుందన్నారు. ప్రధానంగా ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ దశలో ఒక మంచి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విద్యార్థులు సృజనాత్మక ప్రతిభతో అధ్యయనం చేయాలని , సమాజంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులను పూర్తిగా ఆకళింపు చేసుకుని దీనితో వివిధ ఆవిష్కరణలను రూపొందించి సామాజిక దోహదం చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో దాగి ఉన్న వివిధ నైపుణ్యాలను వెలికి తీసి మెరుగులు దిద్దే ప్రక్రియలో భాగంగా ఈ అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఎన్. సుధాకర్‌రెడ్డి, కళాశాల ఎస్అండ్‌హెచ్ విభాగాధిపతి డాక్టర్ పి. చక్రపాణి, ప్రముఖ మెజీషియన్ రాంజీలు పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిటైర్ట్ ఐఏఎస్ అధికారి బి. లక్ష్మీకాంతంను కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కేంద్రాల ముసాయిదా జాబితాపై కలెక్టర్ సమీక్ష



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 12, ప్రభాతవార్త:** ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 76 పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని మౌలిక వసతులు ఉన్నటువంటి కళాశాలలు, పాఠశాలలను పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసినట్లుగా తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి ఆత్మకూరు, బుచ్చి, కోవూరు, పొదలకూరు, ఉదయగిరి, వింజమూరు, కలిగిరి మండలాలలో రెండు పోలింగ్ కేంద్రాలు, అదేవిధంగా కందుకూరు -4, కావలి -6, నెల్లూరు అర్బన్ -9, నెల్లూరు రూరల్ -19 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 7వ తేదీ నాటికి జిల్లాలో పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి 1,13,837 మంది, ఉపాధ్యాయ ఎన్నికకు సంబంధించి 7783 మంది ఓటర్లుగా నమోదుకు దరఖాస్తులు సమర్పించారన్నారు. వాటిని పరిశీలించి ఈ నెల 19వ తేది నాటికి డ్రాఫ్ట్ తయారీ పూర్తి చేసి, 23వ తేది ఎలక్ట్రోరల్ రోల్స్ జాబితా ప్రచురిస్తామని, వాటిపై అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తామన్నారు. వచ్చిన అభ్యంతరాలను డిసెంబరు 25 నాటికి పరిష్కరించి, తుది జాబితాను డిసెంబరు 30న ప్రచురిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున వై.మురళీధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ తరపున సి.హెచ్.వెంకటేశ్వర్లురెడ్డి, ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్, బిజెపి నుంచి సి.హెచ్.ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నుంచి బాల సుధాకర్, సిపిఎం నుంచి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## 11న మాలకొండ హుండీల లెక్కింపు



**వలేటివారిపాలెం నవంబరు 8, ప్రభాతవార్త:** ఈ నెల 11వ తేదీన మాలకొండ శ్రీమాల్యాద్రిలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీలను లెక్కించనున్నారు. స్వామివారికి భక్తులు తమ తమ మొక్కుబడులు, కానుకలు, పిడికిటిరూకలు, నిలువుదోపిడీలను సమర్పించు నిమిత్తం సుమారు 37 హుండీలను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిఉన్నారు. ఇవి మూడు నెలలకొకసారి అనగా 11,12 శనివారాలలో ఈ హుండీలు నిండడం, వాటిని లెక్కించడం ఆనవాయితీ. ప్రతిసారి లెక్కింపు అనంతరం నగదు, బంగారం, వెండి, విదేశీ కరెన్సీని భక్తులు హుండీలలో స్వామివారికి సమర్పిస్తుంటారు. ఇందులో బాగంగానే ప్రస్తుతం భక్తుల కానుకలతో నిండాయి. దీంతో ఈ హుండీలను ఆలయ కమీషనర్ కె.బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లెక్కించడానికి ఏర్పాటుచేశారు. కొండపైన సుమారు 30మంది సిబ్బంది, ప్రత్యేక అధికారులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

## మన్నేటికోటలో ఇంటింటికి వైద్యం



**ఉలవపాడు, నవంబరు 12, ప్రభాతవార్త :** ఇంటింటికి వైద్యం కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మన్నేటికోట పంచాయతీ కార్యాలయ వద్ద డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో నడవలేని స్థితిలో ఉన్నటువంటి రోగులను గుర్తించి వారి ఇంటి వద్దకు వెళ్ళి వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా ఉచితంగా మందులను అందించారు. ప్రతి నెల రెండో శనివారం మన్నేటికోట సచివాలయం వద్ద 104 వాహనము అందుబాటులో ఉంటుందని, గ్రామ ప్రజలు ఈ వాహనం వద్ద వైద్య పరీక్షలు నిర వ్వహించుకుని ఉచితంగా మందులు పొందవచ్చని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావుతో పాటు 104 వైద్యులు లక్ష్మీ నరసింహం, సచివాలయం ఏఎన్ఎం శోభాదేవి, ఎంఎల్‌పీహెచ్ రాఘవశ్రీ, ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్, ఆశా కార్యకర్తలు, పద్మావతి, సునీల్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

## శనివారం ఆదాయం రూ.8.5లక్షలు

**వలేటివారిపాలెం నవంబరు 12, ప్రభాతవార్త:** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని శనివారం కందుకూరు శాసనసభ్యులు మహీధర్‌రెడ్డి, నెల్లూరు విజయడైరీ చైర్మన్ కె.రంగారెడ్డితోపాటు పలువురు భక్తులు దర్శించు కున్నారు. భక్తుల సౌకర్యార్ధం వసతులు మెరుగుపరచాల్సిందిగా ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. భక్తుల సందర్శన ద్వారా సా ్వమి వారికి రూ.8,54,919ల మేర ఆదాయం సమకూరింది. ఆలయ ప్రధాన అర్చకులు గౌరీశంకర్, నరసింహాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అ ందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.8,400లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.16,680లు, వివాహాల నిర్వహణ వలన రూ.3,000లు, తలనీలాలు టిక్కెట్లు వలన రూ.34,150, వాహనపూజల వలన రూ.1,200లు, ప్రత్యేకదర్శనం రూ.2,27,000లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.840లు, రూముల అద్దెలు రూ.28,750లు, కవర్లు అమ్మకం వలన రూ.6,300లు, అన్నదానం నిమిత్తం రూ.3,01,882లు, లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.1,98,345లు విరాళాలు 31,332లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించినట్లు ఆలయ ఏసీ కె.బి శ్రీనివాసరావు తెలిపారు.

## మాలకొండలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి



**వలేటివారిపాలెం నవంబరు 12, ప్రభాతవార్త:** కందుకూరు శాసనసభ్యులు ఎం.మహీధరెడ్డి శనివారం మాలకొండలో పర్యటించారు. సుప్రసిద్ధ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో భకు ్తల సౌకర్యాల అమలు తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. భక్తులకు మెరుగైన సేవలు అందించాల్సిందిగా సిబ్బందికి సూచించారు. మాలకొండకు ప్రతి శనివారం రా ష్ట్రవ్యాప్తంగా భక్తులు శ్రీ స్వామివారి దర్శనం నిమిత్తం రాకపోకలు చేస్తుంటారు. సరాసరిని వారానికి 12వేల మందికి పైగ భక్తులు స్వామివారిని దర్శించు కుంటారు. రూముల అద్దెలు, తలనీలాల టికెట్లు, ప్రత్యేకదర్శన టికెట్లు, పూజలు తదితర అంశాల ద్వారా వారానికి సరాసరిన రూ.10లక్షల దాకా రోజువారీ ఆదాయం వస్తుంది. అదేవిధంగా ఏడాదికి రూ.10కోట్లకి పైగా ఆదాయం ఉంది. అయితే ఈ ఆలయం దేవాదాయశాఖలో అసిస్టెంట్ కమీషనర్ స్థాయి అధికారి పరిధిలో ఉంది. వాస్తవానికి ఈ ఆలయం డిప్యూటీ కమీషనర్ స్థాయిలో ఉండాలి. అయినా దేవాదాయశాఖ గుర్తించకపోవడం శోచనీయం. ఈ నేపద ్యంలో ఆలయంలో భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానిక ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ఇందులో బాగంగానే ఆలయంలో గణనీయమార్పులు చేయించారు. పర్యవేక్షణలోపిస్తే నిర్వహణ లోపభూయిష్టంగా ఉంటుంది. ఇందులో బాగంగానే గతంలో దర్శనంక్యూ, అన్నదాన క్యూ, లడ్డుక్యూ, తలనీలాల క్యూతోపాటు స్నానాలఘట్టం తదితర ప్రాంతాలలో భక్తులు అసౌకర్యానికి గురవుతుంటారు. సిబ్బంది అక్రమాలు, షాపులు నిర్వహకులు అధిక ధరలుకు అడ్డు ఆపు ఉండదు. ఈ నేపద్యంలో ఎమ్మెల్యే భక్తుల సౌకర్యార్థం నిత్యం పరిశీలనలో ఉంటారు. ఇందులో బాగంగానే శనివారం మాలకొండ వచ్చారు. పరిసరాలను పరిశీలించారు. అన్నదాన మండపం, లడ్డూకౌంటర్, దర్శనక్యూ తదితర ప్రాంతాలలో తిరిగి మెరుగైన సేవలందించుటకు చేపట్టాల్సిన పలు సూచనలు చేశారు. ఈ కార ్యక్రమంలో కమీషనర్ కె.బి శ్రీనివాసులు, సూపరింటెండెంటు శ్రీనివాసులు, అనుమోలు వెంకటేశ్వర్లు, పరిటాల వీరాస్వామి, చంద్రమౌళి, యాళ్ల శివకుమార్ రెడ్డి, రోళ్లపాడు వేణు, సంజీవరెడ్డి, పోలినేనిపాలెం వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

## శాస్త్రీయ, జానపద నృత్యాలతో హోరెత్తించిన చిన్నారులు



**కావలి, నవంబరు 12 ప్రభాతవార్త:** డాక్టర్ డిఆర్ విశ్వోదయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో జవహర్ భారతి యంయం హాలులో ఎస్పీ బాలసుబ్రమణ్యం ప్రాంగణంలో శనివారం జరిగిన శాస్త్రీయ, జానపద నృత్యాలతో చిన్నారులు హోరెత్తించారు. అందరిని ఆకట్టుకున్నారు. శాస్త్రీయ, జానపద నృత్య పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని పోటీలు పడుతూ అందరిని అలరించారు. హావభావాలతో, అభినయ నైపుణ్యంతో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు చప్పట్ల వర్షం కురిపించాయి. ఈ కార్యక్రమంలో విశ్వోదయ విద్యాసంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీలు పాల్గొని బాలల దినోత్సవ ప్రత్యేకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా ఉమాశర్మ, నల్లూరు రామకృష్ణ, లక్ష్మి ప్రశాంత్, కోటేశ్వరప్రసాద్‌లు వ్యవహరించారు. అధ్యాపకులు అమరావతి, భార్గవ్‌లు సహాయ సహకారాలు అందించారు. ఆదివారం గ్రూప్ డాన్సులు జరుగుతాయని డైరెక్టర్ కూనం తాతిరెడ్డి తెలిపారు.

## అన్నపూర్ణఅలంకరణలో త్రిపురేశ్వరస్వామి



**వరికుంటపాడు, నవంబర్12, ప్రభాతవార్త:** కార్తీకమాసం సందర్భంగా పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో వున్నటువంటి శ్రీశ్రీత్రిపురేశ్వరస్తామి శనివారం అన్నపూర్ణ అలంకరణలో పూజలందు కున్నారు. అయ్యప్పమాలధారణ స్వాములు కార్తీక శనివారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే మహిళలు పెద్ద ఎత్తులనపాల్గొని ఆలయప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

## మెట్టపైర్లకు ఊరట



**వరికుంటపాడు, నవంబర్12, ప్రభాతవార్త:** శుక్రవారం అర్ధరాత్రినుంచి కురుస్తున్న వర్షం మెట్టపంటలు పండించే రైతులకు కొంత ఊరటనిచ్చింది .మినుము, కంది పచ్చిశనగ పంటలను పండంచేందుకు వీలుగా భూమిప దునయ్యో విదంగా వర్షం కురిసింది. ఇప్పటికే సాగులోవున్న దోస, వరి, దొండ, బీర వంటి పంటలకుకూడా కొంత ఉపశమనం కలిగించింది. అలాగే వివిధ గ్రామాలలో రోడ్లపై వర్షపు నీరు నిలువ వుండడంతో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పారిశుద్యం మెరుగుకు అధికారులు కృషిచేయాల్సిన అవసరం వుంది.

## ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

**వరికుంటపాడు, నవంబర్12, ప్రభాతవార్త:** చైల్డ్ ఫండ్ ఇండియ ఆద్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సునునిర్వహించారు. ఈకార్యక్రమంలో సి.ఎల్.డబ్ల్ యు కార్తీక్ మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది అంటువ్యాది కాదని అంటించుకునే వ్యాదన్నారు. లైంగిక సంభందాల వలనకలుషిత సూదులు, సిరంజుల వాడకం కలుషిత రక్తం మార్పిడివలన వ్యాప్తి చెందు తుంద న్నారు. హచ్.ఐ.వి వున్నవారికి టి.బి వ్యాది వచ్చే అవకాశాలు వున్నాయని తెలిపారు. హెచ్.ఐ.వి దోమకాటువల్లకాని కలసి భోజనం చేయడంవల్ల కాని సోకదని తెలిపారు. ఎయిడ్స్ వ్యాది గ్రస్తులను ఆదరించాలన్నారు. ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగివుండాలని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు స్తానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న మిడతవాగు...రాకపోకలకు అంతరాయం




**కొండాపురం, నవంబర్12, ప్రభాతవార్త:** కొండాపురం మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు సత్యవోలు అగ్రహార సమీపాన వున్న మిడతవాగు వుదృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో కావలినుంచి కొండాపురం రావాలన్నా కొండాపురం నుంచి కావలికి పోవాలన్నా ప్రజలు నానా అవస్తలు పడుతూ కలిగిరి మీదుగా పోతున్నారు. మిడతవాగు ప్రవహిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు హుటా, హుటిన అక్కడికి చేరుకొని వాగు ప్రవాహం గమనించి వాగుకు కంప అడ్డంగా వేశారు. ఈసందర్భంగా ఎస్.ఐ ఖాజావలి మాట్లాడుతూ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంవల్ల సమీప గ్రామాల ప్రజలు అటుఇటు వెళ్ళరాదన్నారు. ఒకవేళ అత్యుత్సాహం చూపించి వెళ్ళేందుకు ప్రయత్నం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిడతవాగు సమీప గ్రామస్తులు వర్షాకాలంలో అప్రమత్తంగావుంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## తనపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**నెల్లూరు టౌన్, నవంబరు 12, ప్రభాతవార్త:** తనపై రెండు రోజుల క్రితం శ్యాంసుందర్ అనే పూర్వ విద్యార్థి దాడి చేశారని, ఈ విషయమై న్యాయం చేయాలని విఆర్ లా కళాశాల అధ్యాపకులు దారా నారాయణ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. తనపై దాడి జరిగిన తీరుపై తక్షణమే స్పందించాల్సిన పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై దాడి జరిగి రెండు రోజులైనా పోలీసులు బలమైన కేసులతో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా నామమాత్రపు కేసుతో ఎఫ్ఐర్‌లో నమోదు చేశారని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని స్పష్టం చేశారు.

## శ్రీసాయిధర్మక్షేత్రంలో నేడు మహాసత్సంగ కార్యక్రమం



**నెల్లూరురూరల్, నవంబరు12 ప్రభాతవార్త:** రూరల్ పరిధిలోని శ్రీసాయిధర్మక్షేత్రంలో ఆదివారం మహా సత్సంగ కార్యక్రమం జరుగుతుంది. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకూ నిర్విరామంగా అకుంఠిత దీక్షతో ఈకార్యక్రమం నిర్వహిస్తారు. భక్తులు విరివిగా ఈకార్యక్రమంలో పాల్గొని, జయప్రదం చేయాలని శ్రీసాయి ధర్మక్షేత్రం నిర్వాహకులు వెలశిరి సాయి కుమార్ తెలిపారు. సాయినాధుని ప్రభోధాలు, వైభవంపై ఈసత్సంగం జరుగుతుందన్నారు. శిరిడి నుండి విచ్చేశే ఆనాటి సాయి భక్తురాలు కుంటముక్కల నిర్మలాదేవి, శ్రీశైలం నుండి విచ్చేశే సాయిదాస్, గుంటూరుకు చెందిన లోకా వెంకట సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజమండ్రి నుండి విచ్చేశే కొంతం యుగంధర్‌వర్మలు సాయి సేవన, సాయి భగత్స్వరూపం, జీవన విధానంలో సాయి మార్గం, బాబా అనుగ్రహం సులభంగా పొందడం అన్న అంశాలపై సత్సంగం జరుపుతారన్నారు. భక్తికి జ్ఞానం తోడైతే భగవంతుని సంపూర్ణ అనుగ్రహం పొందవచ్చన్నారు. ఈసందర్భంగా అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో పాత వస్తువులు వేలం



**ఉదయగిరి నవంబర్ 12 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ బాలుర గురుకుల పాఠశాల ఉదయగిరి మండలం గండిపాళెంకు సంబంధించిన పాఠశాల పాతసామాన్లు ఆంధ్రప్రదేశ్ విద్యాలయ సంస్థ (గుంటూరు ) ఉత్తర్వులు మేరకు వేలం వేయనున్నట్లు ప్రిన్సిపల్ మురళీ శనివారం తెలిపారు. పాఠశాలలో ఇరిగిపోయిన ఉపయోగపడని ఇనుప ట్రంకుపెట్టలు, వంటపాత్రులు ,ఇనుప మిషన్ సామాగ్రి చక్క మంచాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వారు సంబందిత వస్తువులకు పది శాతం దరవస్తు చెల్లించి 15-11-2022 ఉదయం 10.30 నిమిషాలకు పోటీలో పాల్గొనాలని సూచించారు. వేలంలో వస్తువులు పొందిన వారు వారి సొంత ఖర్చులతో పాడిన వస్తువులను తీసుకొని వెళ్లాలని చెప్పారు. ఈవేలం రద్దు పరచుటకు గాని వాయిదా వేసేందుకు గాని పూర్తి అదికారం పాఠశాల ప్రిన్సిపల్ పరిధిలో ఉందని అన్నారు. నాలుగురోజులలోపు వేలం పాడిన వస్తువులను తీసుకొని వెళ్లాలని సూచించారు. వేలం షరత్తులు, ఇతర విషయాల గురించి ప్రిన్సిఫల్ జి మురళీకృష్ణా నెంబర్ 9441601085 సంప్రదించాలని ఆయన కోరారు.

## ఎయిడ్స్ పట్ల అపోహాలు వద్దు




**చేజర్ల, నవంబర్12, ప్రభాతవార్త:** ఎయిడ్స్ వ్యాధిపట్ల అపోహాలు విడనాడి వారి పట్ల గౌరవంగా మెలగాలని చిత్తలూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ నవీన్, డాక్టర్ జ్యోతిలు పేర్కొన్నారు. శనివారం చేజర్ల మండలం కొల్లపనాయుడుపల్లిలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు . చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ హెచ్ఐవి అనేది అంటువ్యాధి కాదన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పరిక్షలు చేయించుకోవడం వలన తమకు వ్యాధి ఉందోలేదో తెలుసుకోగలుగుతామన్నారు. వ్యాధి ఎలాంటి సందర్భాల్లో వస్తుంది, ఎలాంటి సందర్భాల్లో రాదు అన్న విషయమై అవగాహన కల్పించారు. బిపి, షుగర్, హెచ్ఐవి పరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. డాక్టర్లు ఇకపై గ్రామాల్లోని ఉపకేంద్రాలకు వచ్చి వైద్యసేవలు అందిస్తామన్నారు .గర్భిణీలు, వృద్ధులు , దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి ఇళ్ళకు వెళ్ళి వైద్యం అందించనున్నామని డాక్టర్ లు పేర్కొన్నారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు మందులను అందజేశారు. సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండడం మంచిదన్నారు. ఈకార్యక్రమంలో సిహెచ్ఓ మాధవి, హెచ్‌వి సుప్రజ, ఎంఎల్‌హెచ్‌పి మాధురి, ఆరోగ్య కార్యకర్త సుభాషిణి, చైల్డ్‌ఫండ్‌ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ ఎన్.కెన్య , క్లస్టర్ లింక్‌వర్కర్లు ప్రణీత్, శీను, ఆశవర్కర్లు, చిత్తలూరు పిహెచ్‌సి సిబ్బంది ,104 సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం



**చేజర్ల, నవంబర్12, ప్రభాతవార్త:** గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని చేజర్ల మండలం మడపల్లి ఉపసర్పంచ్ పూనూరు మాలకొండారెడ్డి పేర్కొన్నారు . శనివారం మడపల్లిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం సమీక్షా సమావేశాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం గ్రామసభలో వచ్చే అర్జీల పరిష్కారానికి అధికారులంతా కృషి చేయాలని ఆయన కోరారు. వచ్చిన అర్జీలను శాఖలవారీగా అందించారు. తిరిగి శాసనసభ్యులు గ్రామంలో గడపగడపకు వచ్చేలోగా ఈ అర్జీల పరిష్కారానికి ప్రతి అధికారి తనవంతు బాధ్యతగా పరిష్కారం చూపేలా ముందుకు సాగాలన్నారు . ఎంపిడిఓ ఎన్.విజయలలిత, ఎంపిటిసి సభ్యురాలు పూనూరు భారతి, స్థానిక నాయకులు పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఇఒపిఆర్‌డి , పంచాయతీ కార్యదర్శి బిల్లు రామయ్య, సచివాలయ సిబ్బంది , వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల వల్ల అతలాకుతలమవుతున్న రైతులు



**గుడ్లూరు, నవంబరు 12, ప్రభాతవార్త :** బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల శుక్రవారం నాడు రాత్రి నుంచి భారీ వర్షాలు మండలంలో కురుస్తున్నాయి. రైతులు అతలాకుతలమవుతున్నట్లు తెలుపుతున్నారు. గత నెల రోజుల నుంచి ఇప్పటి వరకు 4.5 సార్లు వర్షాలు కురిసే ఈ వర్ష ప్రభావంతో చెరువల్లోకి నీరు చేరింది. దీంతో రైతులు వరి పొలాల్లో నారుమడులు తయారు చేసి విత్తనాలు పోశారు. ఈ వర్షం వల్ల నారు మళ్లు విత్తనాలు తిరగబడ్డాయి. ఇప్పటికే రైతులకు పండిన పంటకు గిట్టుబాటు ధర లేక, ఒక వేళ రైతులు దాన్ని అమ్మినప్పటికి కొన్న మిల్లర్లు డబ్బులు ఇవ్వక వ్యవసాయాన్ని పూర్తిగా మానివేశారు. కౌలు రైతులు మండలంలో చాలా తక్కువ మంది కనిపిస్తున్నారు. అంతంతమాత్రంగా ఉన్న వ్యసాయం రైతులకు ఈ వర్షం నష్టాన్ని కలిగించిందని చెప్పవచ్చు. రైతులు అయితే గత రెండు మూడు సంవత్సరాల నుంచి పత్తికి రేట్లు లేక ఇబ్బందులు పడుతూ నష్టాలతో పత్తిని అమ్ముకుంటూ ఉన్న సమయంలో రేట్లు వచ్చి పత్తి రైతులు కొద్దిగా ఊపిరి పీల్చుకునే సమయానికి ఈ విధంగా అకాల వర్షం పడటం పత్తి రైతులకు కూడా నష్టమే కలిగిస్తుంది. అదే విధంగా కూరగాయాలు, మిర్చి రైతులకు కూడా నష్టమే కలిగించిందని చెప్పవచ్చు.

## కావలి నూతన డిఎస్పీని సత్కరించిన దళిత, గిరిజన నేతలు



**కావలి, నవంబరు 12 ప్రభాతవార్త:** కావలి నూతన డిఎస్పీ యం.వెంకట రమణను దళిత, గిరిజనుల సంక్షేమ సంఘం నేతలు కలిసి దుశ్శాలువాలతో సత్కరించి పూలబొకెను అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత దళిత, గిరిజనుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దావులూరి శాంసన్, ప్రధాన కార్యదర్శి దావులూరి సన్ని, జిల్లా కార్యదర్శి దావులూరి జేమ్స్, రవినాయుడు, పెంచలయ్య, కావలి నియోజకవర్గ కార్యదర్శి గంగపట్నం మహేంద్ర తదితరులు పాల్గొని నూతన డిఎస్పీని అభినందించారు.

## కార్యవర్గ ఎన్నికలు



**నెల్లూరు అర్బన్, నవంబరు 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కార్యవర్గ ఎన్నికలు శనివారం పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ ఎన్నికలలో పంచాయతీరాజ్ రిటైర్డ్ కార్యనిర్వాహక ఇంజనీరు వి.చంద్రశేఖరయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ప్రెసిడెంట్‌గా ఎం.బాబురావు, వైస్ ప్రెసిడెంట్‌గా కె.సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీగా లక్ష్మీనారాయణ, ట్రెజరర్‌గా వి.మన్మదయ్య, ఆర్గనైజ్ సెక్రటరీగా డి.ఉమామహేశ్వరరావులు ఎంపిక అయ్యారు.

## పలువుర్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి



**బుచ్చి నవంబర్ 12 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పలువుర్ని కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరామర్శించారు. మినగల్లు గ్రామంలో శ్రీదర్‌రెడ్డి ఆరోగ్యం బాగలేకపోగా ఆయనను పరామర్శించారు. అలాగే వవ్వేరులో ఇటీవల మేక శ్రీనివాసులునాయుడు ఇటీవల మృతి చెందగ ఆయన కుమారుడు శ్రీకాంత్‌ని పరామర్శించారు. ఖాజానగర్‌లో మున్నా కుటుంబసభు ్యలను పరామర్శిం చాడు. నాగమాంబాపురంలో వంటేరు శ్రీహరిని పరామర్శించి తన ప్రగడాసానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో అధికార ప్రతినిది చెముకుల కృష్ణ చైతన్య, జిల్లా వ్యవసాయ మండలి నాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి బత్తల హరికృష్ణా, వింజంరామానాయుడు, బండ్ల కొండయ్య, ఖాదర్‌భాషా, తాళ్ల నరసింహస్వామి, ఉసురుపాటి ప్రసాద్, వల్లూరు శ్రీనివాసులు, సర్దార్, పాల్గొన్నారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



**బిట్రగుంట, నవంబరు 12 ప్రభాతవార్త** బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజన కాలనీలో శనివారం నిరుపేదలకు, వృద్దులకు చలికి ఇబ్బందిపడుతున్న సమయంలో కాంద్ర సతీష్‌నాయుడు దాతృత్వంతో దుప్పట్లు పంపిణీ చేశామని గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకటపతి తెలిపారు. సమాజంలో కోటీశ్వర్లు వున్నప్పటికీ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి సహాయం చేయాలన్న దృక్పదంతో కాంద్ర సతీష్‌నాయుడు ముందుకు రావడం హర్షించదగ్గ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఆలిండియా మిషన్ కావలి డివిజన్ కన్వీనర్ కె.సింహాద్రిరావు, రాష్ట్ర గిరిజన నేత జయంపు కనకయ్య, ఫ్రాంక్లిన్, పీట్ల ప్రత్యూష్, అంగన్‌వాడీ కార్యకర్త అనూష, వై.శ్రీనివాసులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## దొరికన నాటు సారా ఎక్కువ-చూపేంచేది తక్కువ



**ఉదయగిరి నవంబర్ 12 ప్రభాతవార్త** ఉదయగిరి ప్రాంతంలో ఈ మద్య కాలంలో జరిగిన సంఘటనలు నాటు సారా కుటీరపరిశ్రమలా విరాజిల్లుతుందని పలువురు విమర్శలు చేస్తున్నారు. నాటుసారా విషయంపై సమాచారం అందుకున్న ఉదయగిరి సెబ్ అధికారులు ఉదయగిరి మండలం కృష్ణపల్లి గ్రామంలో నాటుసారా కేంద్రంపై శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. సారా తయారు చేస్తున్న కృష్ణంపల్లి బిసి కాలనీకి చెందిన సింగనబోయిన సబ్బరాయుడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 20 లీటర్ల నాటు సారా, 2 వందల లీటర్ల నాటు సారాకు ఉపయోగించే ముడి పదార్దాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే నాటు సారా ఎక్కువ మొత్తంలో దొరకగా సెబ్ అధికారులు కేవలం 20 లీటర్లు మాత్రమే చూపిస్తున్నారని దాడుల సమయంలో అక్కడేవున్న కృష్ణపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు .శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించగా శనివారం సాయింత్రం 6 గంటల వరకు మండల తహసిల్దారు ముందు హాజరుపరచకపోవడం పలుఅనుమానాలకు తావిస్తుంది. గతంలో కూడా సింగారెడ్డిపల్లిలో నాటు సారా విక్రయ విషయంలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలి వేయడం జరిగిందని విశ్వసనీయంగా తెలిసింది. ఈదాడులు సెబ్ అధికారులు ఎం రవీంద్రబాబు, పి.కిరణ్‌కుమార్, రమణయ్య, చంద్ర, పాల్గొన్నారు.

## ఏబివిపి బుచ్చి నగర నూతన కార్యవర్గం



**బుచ్చి నవంబర్ 12 ప్రభాతవార్త** అఖిల భారతీయ విద్యార్ది పరిషత్ బుచ్చినగర అభ్యసవర్గ స్దానక రత్నం పాఠశాలలో నిర్వహించారు. ఈ అభ్యాస వర్గకి ఏబివిపి రాష్ట్ర ఉపాధ్యాక్షులు పరదేశి గంగాదర్, ఏబివిపి నెలూరు జిల్లా కన్వీనర్ మల్లవరపు అశోక్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో బుచ్చి నగర నూతన కమీటిని ఆంధ్రప్రదేశ్ ఏబివిపి రాష్టా ఉపాధ్యాక్షులు గంగాదర్ ప్రకటించారు. బుచ్చి నగర కార్యదర్శిగా కుమారస్వామి, నగరసహాయ కార్యదర్శులుగా శ్రీహరి, శ్రీనివాసులు, వెన్నెల, సోషల్ మీడియా కన్వీనర్, కో -కన్వీనర్‌గా తరుణ్, సుమంత్ హాస్టల్ కన్వీనర్‌గా కార్తిక్ ఎస్ఎఫ్‌డి కన్వీనర్‌గా మనివర్దన్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్‌గా శివ, కళామంచు కన్వీనర్‌గా అర్చన, టెక్నికల్ కన్వీనర్‌గా హరిష్, విద్యార్ధిశక్తి పోస్టర్ సిద్దు, కార్యవర్గ సభ్యులుగా విష్ణు, నాగభరత్, వివేక్ తదిత 25 మందితో నగర కమీటిని ప్రకటించారు. ఈ సందర్భంగా ఏబివిపి రాష్ట్ర ఉపాధ్యాక్షులు పరదేశిగంగాదర్ మాట్లాడుతు దేశంలో కల్లా అతిపెద్ద విద్యార్ది సంఘం ఏబివిపి అన్నారు. జిల్లా కన్వీనర్ మల్లవరపు అశోక్‌రెడ్డి మాట్లాడుతు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశంలో ఎలాంటి విపత్తు సంబంవించినా మేమున్నామంటు ముందుకు వచ్చే సేవా కార్యక్రమాలు చేసే ఏకైక విద్యార్ది సంఘం ఏబివిపి అని తెలిపారు. ఏబివిపి బుచ్చి భాగ్ కన్వీనర్ వినయ్‌కుమార్, తదితర పూర్వవిద్యార్దులు పాల్గొన్నారు.

## సంయుక్త సేవా సంస్థ సభ్యుల సహకారంతో వృద్దుడి అంత్యక్రియలు



**కావలి రూరల్, నవంబరు 12 ప్రభాతవార్త** సంయుక్త సంస్థ ఆధ్వ ర్యంలో కావలి పట్టణంలోని బుడమగుంట ఇందిరమ్మ కాలనీకి చెందిన వెంకయ్య(70) చనిపోవడంతో సంస్థ సభ్యుల సహకారంతో అంత్యక్రి యలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడుతూ వెంకయ్య అనే వృద్దుడు మృతి చెందాడన్నారు. వృద్దుడు అంత్యక్రియలకు సహాయం చేయాలని ఆ ప్రాంత ప్రజలు తమ సంస్థను ఆశ్రయించారన్నారు. వెంటనే స్పందించి అంత్యక్రియలకు సహాయం చేయడంజరిగిందన్నారు. వెంకయ్య అంత్యక్రియలకు సహాయం చేసిన తమ సంస్థ సభ్యులకు ఆ ప్రాంత ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారని చెప్పారు.

## నియోజకవర్గంలో నేటి నుండి గడపగడపకు మన ప్రభుత్వం

**ఆత్మకూరు, నవంబర్12, ప్రభాతవార్త:** గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 13 ఆదివారం నుండి 18వ తేదీ వరకు ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటిస్తారని వైసిపి నాయకులు తెలిపారు. 13 నుండి 14వ తేదీ వరకు ఆత్మకూరు రూరల్ మండలం అప్పారావుపాళెం సచివాలయం పరిధిలో పర్యటిస్తారని మధ్యాహ్నం 2గంటలకు గ్రామంలో నూతనంగా నిరి ్మంచిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. 15, 16తేదీల్లో చేజర్ల మండలం చిత్తలూరు సచివాలయ పరిధిలోను, 17,18 తేదీల్లో ఏఎస్‌పేట మండలం పెద్దబ్బీపురం సచివాలయ పరిధి లోను, 18వ తేదీ ఉదయం 9గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతంద న్నా రు. మిగిలిన రోజుల్లో యధావిధిగా మధ్యాహ్నం 3.30గంటల నుండి కార్యక్రమం ప్రారంభమ వుతుం దన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని వారు కోరారు.

## రక్తదాన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి



**కావలి, నవంబరు 12 ప్రభాతవార్త** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రక్తదాన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా స్వర్గీయ కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి నిలిచిపోయారని పలువురు వక్తలు కొనియాడారు. కావలి రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో శనివారం కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్బంగా జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, సాయి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ గోసల గోపాల్‌రెడ్డి, పూనూరు మురళిధర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, ఆల్తూర్తి సతీష్‌రెడ్డి, బట్టేపాటి ప్రసాద్, అప్పల కళ్యాణచక్రవర్తి, కె.గోపీకృష్ణ, తదితరులు పాల్గొని మాట్లాడారు. రక్తదానంపై సామాన్యులకు అవగాహన లేని సమయంలో కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి ఎటువంటి ప్రచారం చేసుకోకుండా ఆయన పదుల సంఖ్యలో రక్తదానం చేసి రక్తదాన ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. అజ్ఞాత రక్తదాతగా పేరు గడించారన్నారు. సరైన వైద్య సదుపాయలు లేని రోజులలో కలరా మహమ్మారి ప్రబలినప్పుడు ఈ వ్యాధిగ్రస్తులకు సేవలందించిన మహనీయుడు ఆదినారాయణరెడ్డి అన్నారు. పేద ప్రజలకు మద్రాసు కార్పొరేట్ ఆసుపత్రులలో ఆదినారాయణరెడ్డి తన సొంత నిధులతో వైద్యం చేయించి ఆదుకున్నారన్నారు. ఈ ప్రాంత ప్రజల హృదయాలలో స్వర్గీయ కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు.

## జగనన్న ఇళ్ల భూమి కొనుగోలులో కోట్లు గడించిన వైసిపి నేతలు



**కావలి, నవంబరు 12 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలో జగనన్న ఇళ్ళ భూమి కొనుగోళ్లలో వైసిపి నేతలు కోట్లు గడించారని, మాట వినని జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర్లను బదిలీ చేయించిన ఘనత ఎమ్మెల్యే, ఆయన అనుచరులకే దక్కిందని జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ తెలిపారు. జగనన్న ఇళ్లు-పేదలందరికీ కన్నీళ్లు, జనసేన సామాజిక పరిశీలనలో జగనన్న మోసం అనే కార్యక్రమాన్ని జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం కావలి మున్సిపాల్టీ పరిధిలోని మద్దూరుపాడు టిడ్కో ఇళ్ళ సముదాయం, ముసునూరు జగనన్న కాలనీల వద్ద జనసేన నాయకులు ప్లెకార్డులు పట్టుకొని నిరసన నినాదాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అళహరి సుధాకర్ మాట్లాడారు. 2018 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో టిడిపి పాలనలో పేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు టిడ్కో గృహాలు నిర్మించారన్నారు. 2019లో కొంతమంది చేత గృహ ప్రవేశాలు కూడా చేయించారన్నారు. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిందన్నారు. మూడున్నరేళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో ఒక్కరికి కూడా టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా ఆ ఇళ్ళకు రంగులు మార్చి మోసం చేశారన్నారు. డబ్బులు కట్టిన లబ్దిదారులు బ్యాంకులకు ఈయంఐలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. ముసునూరు జగనన్న మెగా లేఅవుట్ కాలనీ కోసం 10 లక్షలకు ఎకరా భూమిని కొనుగోలు చేసి దాదాపు కోటి రూపాయలకు ప్రభుత్వానికి అమ్మి వైసిపి నేతలు కోట్లలో డబ్బులు గడించారన్నారు. ఈ బహిరంగ దోపిడీని నిరాకరించిన ఆనాటి జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్లను సెలవుపై వెళ్లే విధంగా కావలి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పాటుపడ్డారన్నారు. కేవలం ఆరు అంకణాలు (432 అడుగులు) పేద ప్రజలకు కేటాయించి ఇల్లు కట్టిస్తామనడం దారుణమన్నారు. ఈ ఇళ్ల నిర్మాణానికి లక్షా 80 వేల రూపాయలు ప్రభుత్వం ఇస్తే ఎలా సరిపోతుందన్నారు. మిగిలిన ఖర్చు లబ్దిదారుడు భరించలేక ఇళ్లు వదులుకున్న సందర్భాలు కూడా వున్నాయన్నారు. ఇళ్లు కట్టుకున్న వాళ్లకు ప్రభుత్వం ఇస్తానన్న డబ్బులు ఇవ్వకుండా జగనన్న మోసం చేస్తున్నాడని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సమ్మన వెంకట సుబ్బయ్య, అధికార ప్రతినిధి రిషికేష్‌లు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల అపార్ట్‌మెంట్ పేద ప్రజల కలను వైసిపి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. జగనన్న మోసం చేశాడన్నారు. జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయివిట్టల్, కోఆర్డినేటర్ తిరుమలశెట్టి సుధీర్, ఉపాధ్యక్షుడు నాగార్జున, రూరల్ మండల అధ్యక్షుడు వెంకయ్య, బోగోలు మండల అధ్యక్షుడు నూరుద్దీన్, ప్రవీణ్, అల్లూరు మండల అధ్యక్షుడు కార్తీక్ శర్మ, వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, ప్రవీణ్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు. అయితే పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు కావలిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రెండు వేర్వేరు కార్యక్రమాలు చేపట్టి ఈ పార్టీలో కూడా రెండు గ్రూపులు వున్నాయన్న ప్రచారానికి తెరలేపారు.

## అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు



**వింజమూరు, నవంబర్12, ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని గాయత్రీనగర్‌లో వేంచేసి యున్న శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శనివారం అయ్యప్పస్వామికి ఉభయకర్తలు చేజర్ల భాస్కర్‌రెడ్డి -విజయలక్ష్మి , చేజర్ల పురుషోత్తంరెడ్డి-అరుణ, చేజర్ల వైష్ణవి, బ్రహ్మణి , సుకన్య , బ్రహ్మావర్ధన్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి అష్టోత్రం, వినాయకుని అష్టోత్రంను నిర్వహించి అయ్యప్పస్వామికి ప్రత్యేకంగా తెచ్చిన పూలతో పూజలు నిర్వహించారు. అనంతరం చేజర్ల బ్రహ్మారెడ్డి-సులోచనమ్మల జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ



**వింజమూరు, నవంబర్12, ప్రభాతవార్త:** వింజమూరులోని పోస్టాఫీసు వీధిలో నివాసముంటున్న దాదిబత్తిన రమణారెడ్డికి శనివారం ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సిఎం సహాయనిధి 50వేల రూపాయల చెక్కును రమణారెడ్డికి అందజేశారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో వైద్య అవసరాల నిమిత్తం సిఎం నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన సిఎం సహాయనిధి చెక్కును అందించేందుకు కృషి చేస్తున్నా రన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలందరి ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య, ఆరోగ్యశాఖను బలోపేతంచేసి పెద్ద పెద్ద కార్పొరేట్ వైద్యశాలల్లో సైతం విలువైన ఆరోగ్యపరిక్షలు, ఆపరేషన్లు చేయించుకునేందుకు అవకాశం కల్పించాడన్నారు. మనరాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ రాష్ట్ర ప్రజలు వైద్యం చేయించుకుంటే ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార కార్యదర్శి శాంతకుమారి, మండలకన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి, సొసైటీచైర్మెన్ జూపల్లి రాజారావ్, నాయకులు బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైసిపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పోలంరెడ్డి పరామర్శ



**కోవూరు, నవంబరు12 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని నేతాజీనగర్ కాలనీలో టీడీపీ నాయకులు షేక్ అమీర్ మాతృమూర్తి షేక్ జబీనా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు శనివారం కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వారుఇ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ సమయంలోనే గుండె ధిటవు చేసుకుని ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీహెచ్ కృష్ణచైతన్య, నాటకరాణి వెంకట్, ఎస్ శ్రీనివాసులు, ఎన్. నాగేశ్వరరావు, ఎం. మురళీకృష్ణ, ఆంజనేయులు, వంశీ, గౌస్ బాషా, జమీర్, ప్రసాద్, నాగరాజు, ఫిరోజ్, దిలీప్‌లు ఉన్నారు.

## పాడి రైతుల్లో అవగాహన పెంచాలి



**కోవూరు, నవంబరు12 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాడి రైతుల్లో రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న గ్రామ పశు సహాయకులు పాడి రైతుల్లో మరింత అవగాహన పెంచేలా దృష్టి పెట్టాలని వెటనరీ ఏవో సజ్జాద్ అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాలలో వెటనరీ విద్యార్థులకు గ్రామ సహాయకులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి వినూత్న పథకాలను ప్రవేశపెడుతుందని వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా రైతులకు తమవంతుగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎదకు వచ్చిన పశువులను ఏ విధంగా గుర్తించాలి పలు విషయాలపై వారికి అవగాహన కల్పించారు.

## మెగా లోక్ అదాలత్ విజయవంతం 1179కేసుల పరిష్కారం



**కోవూరు, నవంబరు12 ప్రభాతవార్త :** కోవూరులోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 1179 కేసులు పరిష్కారమయ్యాయి. అందులో క్రిమినల్ కేసులు 1100, సివిల్ కేసులు 4, బ్యాంకులకు సంబంధించిన కేసులు 75 పరిష్కారమయ్యాయి. ఈ ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌లు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసుకుని బ్యాంకుకు సంబంధించిన పలు కేసులను ఈ సందర్భంగా పరిష్కరించుకున్నారు.

## నేడు ఉజ్వల ఖ్యాతికి ఇండియా, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రధానం



**నెల్లూరు టౌన్, నవంబరు 12, ప్రభాతవార్త:** చిత్రలేఖనంలో అత్యున్నత ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థిని ఉజ్వల ఖ్యాతికి ఆదివారం ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను ప్రధానం చేయనున్నారు. ఉద్యోగుల ఖ్యాతి చిత్రలేఖన కళాఖండాన్ని గుర్తించి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పురస్కరించుకుని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లను ఆదివారం సొంతం చేసుకోనున్నారు. నెల్లూరు నగరంలోని టౌన్ హాలులో ఆదివారం ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేసిన ఉజ్వల ఖ్యాతి అభినందన వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధంచేశారు. ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్ లోకల్ అడ్వైజరీ కమిటీ, ఎస్‌వి టెంపుల్ కం ఇన్ఫర్మేషన్ సెంటర్ న్యూఢిల్లీ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మోడరన్ స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి సభకు అధ్యక్షులుగా హాజరు కానున్నారు. ఆత్మీయులు అతిథులుగా గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్ డైరెక్టర్ ఎస్.విజయరామిరెడ్డి, స్కాలర్స్ స్కాలర్స్ కరస్పాండెంట్ పి.పద్మజారెడ్డి, ఇతాక ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ కుమ్మమూరు రవి, నేషనల్ హైవేస్ ఆర్‌అండ్‌బి డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.అనిల్‌కుమార్‌రెడ్డి, విశ్రాంత సమన్వాయ అధికారి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ తిరుపతి, తిరుమల దేవస్థానం మల్లెలశ్రీహరి, ప్రముఖ కవి లాయర్ వారపత్రిక సబ్ ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు తదితరులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

## ప్రజాభిప్రాయం సేకరణకు గడప గడపకు భేష్



**నెల్లూరు టౌన్, నవంబరు 12, ప్రభాతవార్త:** గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల నుంచి నేరుగా సమస్యలు ప్రభుత్వ దృష్టికి వెళ్లడంతో పాటు పరిష్కారం కొరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం భేష్ అని ఇండియన్ నేషనల్ లీగ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సమీ హుస్సేన్ ప్రశంసించారు. శనివారం నెల్లూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శాసనసభ్యుల పనితీరు, పరిపాలన - సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాలు సేకరించేందుకు ప్రభుత్వ కార్యక్రమంగా ఎంతగానో ఉపయోగపడుతుంది అనే భావనతో రాష్ట్ర ప్రభుత్వాధినేత శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వంనకు కార్యక్రమమునకు శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని తమ పార్టీకి చెందిన శాసనసభ్యులకు పదే పదే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అనునిత్యం నిర్వహిస్తూ ప్రజల మధ్య ఉండాలని ఆదేశిస్తున్నా, మొక్కుబడిల గడప గడపకు కార్యక్రమం నిర్వహించుకుని ఈ రోజుకి ఇది చాలు మరలా నాలుగు రోజుల తరువాత చేస్తే సరిపోతుంది అని చేతులు దులుపుకునే వారు కొందరైతే, రోజు మార్నింగ్ వాక్‌లా చేస్తే సరిపోతుంది అనే లెక్కలో మరికొందరు సొంత ప్రచారం కోసం కార్యక్రమం నిర్వహించి పత్రికలకు ప్రకటన పంపించి ఒక పని అయిపోయింది బాబు అనే కోవలో మరికొందరు, కార్యక్రమం ఉద్దేశంను ప్రజల్లో తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్న కొద్దిమందితో పాటు పలు రకాలుగా రాష్ట్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించబడుతున్నది. ఇక ప్రజల విషయంకొస్తే కొన్ని చోట్ల ప్రజా సమస్యలు పరిష్కారం అవ్వడం ఏమో గానీ గడప గడపకంటూ తమ గడపకు వచ్చి బాజా భజంత్రీల మధ్య మీ కుటుంబానికి ప్రభుత్వం తరపున వచ్చే పథకాలలో మీరు లబ్ది పొందుతున్న పథకాలు ఇవి అంటూ లబ్దిదారుడి పేరుతో పాటు పథకానికి అందరి మధ్యలో వెల్లడి చేస్తుండడంతో కార్యక్రమం పేరిట మా గడపకు వచ్చింది మా సమస్యలు తతీర్చడానికా.. లేదా మాకు వచ్చే పథకాలు జనం అందరికీ తెలియపరచడానికా.. అసలు ఈ పథకం ఉద్దేశం ఏమిటి? అనే సందిగ్ధంలో కొందరైతే, లబ్దిదారులలో ఆత్మాభిమానం కలిగిన వవారు జనం ముందు తమకు అందుతున్న పథకాల గురించి బహిరంగ పరచడాన్ని చిన్నతనంగా భావించేవారు మరికొందరు. ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ది కోసం విధించిన ఆంక్షల వలన పథకాలు రాని వారు ప్రజా ప్రతినిధిని ప్రశ్నిస్తే రాని కారణాన్ని వివరించకుండా మరోసారి దరఖాస్తు చేసుకోండి అని హామీ ఇస్తున్నారు. రాని పథకం గురించి ఎదురు చూసి నిరాశ చెందేవారు మరికొందరైతే, సాంకేతిక లోపాల వలన వస్తున్న పథకం ఆగిపోతే గడప గడపకు కార్యక్రమంలో నిలదీస్తే ప్రజల మధ్య తనను నిలదీశారు అనే భావం ప్రజా ప్రతినిధులకు కలిగితే వారితో మనకెందుకు వైరం అని మరికొందరు. ఇలా పలు రకాలుగా ప్రజలు భావిసున్నారని పలువురు అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను ప్రభుత్వపరంగా స్థానిక ప్రజా సమస్యలు పరిష్కరించే కార్యక్రమంగా, ప్రజలలో ఒక మంచి అభిప్రాయం ఏర్పడి స్వచ్ఛంధంగా ప్రజలు తమకు తాము ఈ కార్యక్రమం ద్వారా తమ సమస్య పరిష్కారాల కొరకు వినియోగించుకునేలా రాజకీయాలకతీతంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో నిర్వహించే కార్యక్రమంలా ప్రణాళికను రూపొందించి ప్రజా ప్రయోజనార్థం ఉపయోగపడేలా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేయాలి.

## పొదలకూరులో విలేజ్ హెల్త్ క్లీనిక్



**పొదలకూరు నవంబర 12 ప్రభాతవార్త** పొదలకూరు పట్టణంలోని ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలోని సచివాయం బిట్-1లో ప్రారంభమైన ఫ్యామిలి ఫిజిషియన్ వైద్యశిబిరానికి మహ్మదాపురం వైద్యాధికారి డాక్టర్ రమేష్ హాజరై నరసారెడ్డి కాలనీలో ఇంటింటికి వెళ్లి ఆర్యో స్దితిగతుల పట్ల వాకబ్ చేశారు. ఆయనతోపాటు పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టమ్మ కూడా ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతోబాదపడుతున్న వారికి ఇండ్లకి వెళ్లి డాక్టర్ రమేష్ ప్రస్తుత ఆరోగ్య విషయాలను కుటుంబ ఆరోగ్య స్దితిగతులు గురించి తెలుసుకున్నారు. ఈక్రమంలో నరసారెడ్డి కాలనీలో బ్రెయిన్ స్టోక్‌తో బాదపడుతు మంచానికే పరిమితమైన శ్రీనారాయణ అను వ్యక్తిని కలసి వైద్యపరీక్షలు చేసి డాక్టర్ రమేష్ మనోధైర్యం కల్పించారు. ఈ సందర్బంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతు ఇంటింటికి వెళుతు ఆయా వ్యక్తుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటు సేవలు అందించడం ప్రభుత్వం విలేజ్ క్లీనిక్‌పేరుతో పెట్టిన కార్యక్రమం సంతృప్తి నిస్తుందని అన్నారు.

## పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



**సంగం నవంబర్ 12 ప్రభాతవార్త** పదోతరగతి విద్యార్ధులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బిసి వెల్పే ర్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారి వై .వెంకటయ్య సూచించారు.అన్నారెడ్డిపాళెంలోని బిసి బాలుర వసతి గృహా న్ని ఎబిసిడబ్ల్యూ శ్రీదేవితో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నాడు-నేడు పనుల ద్వారా మంజూరు అయిన ప్రభుత్వ భవనాలు ఉన్న వసతిగృహాలను పరిశీలించినట్లు ఆయన తెలి పారు. ఆత్మకూరు,రేవూరు హాస్టల్స్ నాడు-నేడు కింద మంజూరు అయినట్లు చెప్పారు.గతం సంవత్సరం కూడా బిసి హాస్టల్ విద్యార్ధులు మంచి ఫలితాలు సాధించారని ఈ సంవత్సరం పదోతరగతి విద్యార్ధులపై ప్రత్యేక దృష్టి తీసుకొన్నట్లు తెలిపారు.ప్రభుత్వం విద్యార్ధులకు అద్భుతమైన మెను ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. పదోతరగతి విద్యార్ధుల కోసం టూ ్యటర్లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.అ న్నా రెడ్డిపాళెం బిసి హాస్టల్లో విద్యార్ధుల మంచి ఫలితాలు సాధిస్తున్నారని వార్డన్ శివకుమార్ని అభినందిం చా రు.ఈకార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది,విద్యార్ధులున్నారు.

## కలెక్టర్ దత్తత గ్రామంలో తాగునీటి కొరత



**ఉదయగిరి నవంబర్ 12 ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ దతత్త గ్రామమైన ఉదయరి మండలం తిరుమలాపురం పంచాయితీ సుజాత నగర్లో గత పదిరోజులుగా త్రాగునీటికి తీవ్ర ఇబ్బంది ఎదుర్కుంటున్నారు.ఆగ్రామంలో ఆర్ఒ ప్లాంట్ ఉన్నప్పటికి అదిమోరా యించడంతో త్రాగునీటికి ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు తెలిపారు. తిరుమలాపురం దుంపవారిపల్లి ,సుజాతనగర్, ఈప్రాంతమంతా ఫ్లోరైట్ వాటర్ కలిగి ఉంటుంది ఆ నీరు త్రాగేందుకు అనుకూలంగా లేని కారణంగా గండిపాలెం రిజర్వాయర్ నుండి పైప్ లైను ద్వారా నీరు అందించే వారు. అదికూడా మరమ్మత్తులకు నోచుకోవడంతో గ్రామస్తుల సౌకర్యార్ధం అప్పటి కలెక్టర్ సుజాత ఆరోఒప్లాంట్ ఏర్పాటుచేశారు.ఆర్ఒప్లాంట్ పనిచేయక పోవడం చలమనినీరు ,వాగునీరు త్రాగుతు గ్రామమం తా చలిజ ్వరాలతో జలుబు దగ్గులతో ఇబ్బందులు పడుతున్నారని,గ్రామస్తులు తెలిపారు.సంబంధిత శాఖ అధి కారులు స్పందించి ఆర్ఒప్లాంట్ రిపేరు చేయించి త్రాగునీరు అందించవలసిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.

## డివైడర్ని ఢీకొట్టిన మోటార్సైకిల్...యువకుడు దుర్మరణం



**మనుబోలు, నవంబరు 12 ప్రభాతవార్త** చెన్నై-కలకత్తా 16వ నెంబరు జాతీయ రహదారిపై గూడూరు వెళ్లే మార్గంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డివైడర్ని మోటార్సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తిరుపతి నగరానికి చెందిన పి.రవి తేజ(30) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నెల్లూరు రిలయ న్స్ కంపెనీలో ఆయన పనిచేస్తున్నాడు. బుల్లెట్ మోటార్సైకిల్పై తిరుపతికి వెళ్తుండగా బద్వేల్ రోడ్డు దగ్గర కొత్తగా నిర్మిస్తున్న వం తెన సమీపంలో డివైడర్ని మోటార్సైకిల్ ఢీకొంది. దీంతో రవితేజ అక్కడికక్కడే చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. మృతుడుకి భార్య, కూతురు వున్నట్లు బ్రతుకుదెరువు కోసం నెల్లూరు వచ్చి తిరిగి వెళ్తూ ప్రాణాలు పోగోట్టుకున్నాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ ముత్యాలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జగన్ ప్రభుత్వంలో నూతన వ్యవస్థకు శ్రీకారం



**కలువాయి నవంబర్ 12 ప్రభాతవార్త** జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఇంతమంది ప్రజలకు సమావేశమై ప్రభుత్వ కార్యాక్రమాలు నిర్వహిస్తున్నామంటే ప్రభుత్వం నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టిసచివాలయాల ద్వారా అబివృద్ధికి తోడ్పడడం నిదర్శనమని మాజీ మంత్రి వెంకటగిరిశాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కలువాయి మండలంలోని కేశమనేనిపల్లిపంచాయితీలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగాచింతలాత్మకూరులో 15.80 లక్షల రూపాయాలతో లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులకు ఆనం శంకుస్థాపన చేశారు.కేశమనేనిపల్లిలో 40 లక్షల రూపాయాలతో నేర్మించిన సచివాలయ భవనాలను ఆనం ప్రారంభించారు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న సంక్షేమపథకాలు వివరిస్తు ప్రజలందరికి నెరవేర్చిన ప్రతి హామిని గుర్తు చేస్తు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమపథకాలను వారికి ఎంత మేర అందేయో తెలియజేస్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆనం ప్రారంభిం చా రు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రామనారాయణరెడ్డి మాట్లాడుతు కేశమనేనిపల్లి సచివాలయ పరిధిలోని 1040 నివాసగృహాలకు వైఎస్ఆర్ సంక్షేమపథకాలు నవరత్నాల ద్వారా3036 మంది లబి ్ధదారులకు 7 కోట్లా 93 లక్షలా 80 వేలా 736 రూపాయాలు వారికి ఖాతాలకు జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.మండల పరిధిలో నవరత్నాలు ,వైఎస్ఆర్ సంక్షేమపథకాల ద్వారా 44475 మందికి లబ్ధి దారులకు 103 కోట్లా 65 లక్షలా 5 వేల 8వేల 858 రూపాయాలు అందించడం జరిగిందని తెలిపారు. అదే విధంగా సోమశిల దక్షణ కాలువ నుండి కలువాయి మండలంలో పలు గ్రామాలకు సాగునీరు అందిం చాల అనేది ఆలోచనగా చింతలాత ్మకూరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. ఇందుకు మంత్రులు కాకాణి గోవర్ధన్రెడ్డి,అంబటిరాంబాబు సాహకారం అందించడం జరిగిందని రైతులకు మంచి చేసే ప్రయత్నం జరుగుతుంటే కొంతమంది ద్వారా అడ్డంకులు ఎదురౌతున్నాయని ఆయన తెలిపారు. వందలాది ఏకరాల నిమ్మతోట్లకు లిఫ్ట్ ఇరిగేషన్ ఉపయోగపడుతుందని రైతు సంక్షేమం కోసమే ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో జడ్పిటిసి బులగాకుల అనీల్కుమా ర్రెడ్డి ,ఎంపిపి ఆర్ లక్ష్మీదేవి,సొసైటీ అద్యక్షులు చల్లా సుబ్బరామిరెడ్డి,వైస్ ఎంపిపి పంగా పెంచలనరసారెడ్డి,దొంపా రమాదేవి, తహసిల్దారు సోమ్లానాయక్,ఎంపిడిఒ నారాయణ, ఎంఇఒ సుధీర్బాబు,చీపినాపి ఎంపిటిసి సంకల వెంక టేశ్వర్లు,కేశమనేని పల్లి ఎంపిటిసి రామసుబ్బయ్య, చింతలాత్మకూరు సర్పంచ్ ఏలూరు ప్రభావతి,కేశమనేని పల్లి సర్పంచ్ సక్కల కృష్ణ,వైసిపి నాయకులు సుంకు చెంగయ్య, పర్లకొండ సర్పంచ్ పామూరు కేశవులు,నర్ల శ్రీనివాసులురెడ్డి,పామూరు రమేష్,ఆర్ రత్నారెడ్డి, కార్యకర్తలు పాల్గోన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన దావూద్



మర్రిపాడు,నవంబర్12,ప్రభాతవార్త: మండలం లోని కంపసముద్రం ఉర్దూ ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ దావూద్ ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మైలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా గుంటూ రు లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగ న్మోహన్రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్యక్ర మంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ నదీమ్ అ హ్మద్, కృష్ణాజిల్లా కలెక్టర్ ఇంతియాజ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అందరి మన్ననలు పొందుతు న్న దావూద్ రాష్ట్రస్థాయి అవార్డు పొందడం పట్ల మండల విద్యాశాఖ అధికారి మాలకొండరావ్, మండ లంలోని పలువురు ఉపాధ్యాయులు, బంధుమిత్రులు , గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు .

## జగనన్న ఇళ్లు...పేదలందరికి కన్నీళ్లు



**కావలి, నవంబరు 12 ప్రభాతవార్త** జగనన్న ఇళ్లు పేదలందరికి కన్నీళ్లుగా మారాయని, జగనన్న మోసాన్ని బట్టబయలు చేసేందుకు జనసేన పార్టీ వినూత్న కార్యక్రమం చేపట్టిందని కావలి జనసేన నేత, చిరంజీవి యువత అధ్యక్షులు యం.వి.సిద్దు తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్కళ్యాణ్, నాదెండ్ల మనోహర్, నెల్లూరు జిల్లా అధ్యక్షులు మనుక్రాంతరెడ్డి పిలుపు మేరకు కావలి రూరల్ మండలం రుద్రకోట జగనన్న ఇళ్ళ నిర్మాణాల వద్ద జనసేన నాయకులు శనివారం నిరసన నినాదాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దు మాట్లాడారు. పేద ప్రజల్ని ఆదుకునేందుకు జగనన్న పేరుతో ఇళ్లు కట్టిస్తున్నామని ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ప్రజల్ని మోసం చేశాడన్నారు. ఊరికి దూరంగా వాగులలో, వంకలలో, స్మశానాలలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారన్నారు. ఎందుకు ఉపయోగం లేని విధంగా ఆరు అంకణాలలో ఇళ్లు కట్టిస్తూ పేదలకు కన్నీళ్లు తెస్తున్నాడన్నారు. జగన్రెడ్డి పాలన వచ్చి మూడున్నరేళ్లు కావస్తున్నా కావలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు జగనన్న కాలనీలలో ఒక్క ఇల్లు కూడా గృహ ప్రవేశం జరగలేదన్నారు. జగనన్న ఇళ్ల పేరుతో ఒక్కొక్క ఎకరా 10-12 లక్షల రూపాయలకు వైసిపి నేతలు కొనుగోలు చేసి నాలుగైదు రెట్లు ప్రభుత్వానికి అమ్మి కోట్లలో ప్రజల సొమ్మును దోచుకున్నారన్నారు. ఈ కాలనీల పేరుతో కావలి నియోజకవర్గంలో వైసిపి నాయకులు ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం లేని చోట భూమి నాణ్యత లేని ప్రాంతంలో జగనన్న ఇళ్ల కాలనీలు ఏర్పాటు చేశారన్నారు. అయితే కొన్ని ప్రాంతాలో శిలాఫలకాలకే పరిమితమయ్యాయన్నారు. అవినీతి కుంభకోణం చేయడంలో రాష్ట్రంలోనే కావలి నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తోట వెంకట శేషయ్య మాట్లాడుతూ ఒక్కో లబ్ధిదారునికి ఆరు అంకణంలో స్థలం కేటాయించడం దారుణ మన్నారు. ఈ ఆరు అంకణాల స్థలంలో ఎలా అన్ని వసతులతో ఇల్లు కట్టించుకొని జీవనం సాగించడం దుం ్లబమన్నారు. జగనన్న కాలనీల పేరుతో కావలి నియోజకవర్గంలో భారీ స్థాయిలో దోపిడీ జరిగిందని దుయ్య బట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కావలి రూరల్ అధ్యక్షులు తిరుపతిస్వామి, మనోజ్, చక్రి, తోట సాయి, చిన్నా, చేవూరి సాయి, అళహరి పణి, రాకేష్, జోషి తదితర జనసేన పార్టీ నాయకులు మా ట్లాడారు. ప్లెకార్డులు ప్రదర్శించారు.

## వర్షంలో సైతం గడపగడపకు మన ప్రభుత్వం



**వింజమూరు,నవంబర్12,ప్రభాతవార్త:** వింజమూరు మండలం కిస్తీపురం పంచాయతీ పరిధిలోని చింతల పాళెం, కిస్తీపురం గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వర్షంలో కూడా ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్రెడ్డి, ప్రచార కార్యదర్శి శాంతకుమారిలు ఇంటింటికి తిరిగి నవరత్నాల కర పత్రాలను, ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన కుటుంబ సభ్యుల కరపత్రాలను అందిస్తూ ప్రజల యోగక్షేమాలను తెలుసుకున్నారు. పంచాయతీ లోని ఎస్సీ కాలనీ లో అనేక సమస్యలను ఎమ్మెల్యే పర్యటనలో గుర్తించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి వైఎస్ఆర్సిపి ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజా అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పాలనను అందిస్తూ శభాష్ జగనన్న అని ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం వైఎస్ కుటుంబ సభ్యుల పాలనలోనే అభివృద్ధి చెందిందన్నారు. జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గం అభివృది ్ధకొరకు తమవంతు సహాయ సహకారాలను అందిస్తున్నా రన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డి పరిపాలనలో కొంతమేర అభివృద్ధి చెందిందని , నేడు ఆయన తనయుడు వైఎస్జగన్మోహన్రెడ్డి పాలనలో ప్రతి పంచాయతీలో అభివృద్ధే ధ్యేయంగా పాలన అందిస్తున్నారన్నారు .రాష్ట్రంలో ని ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకువచ్చిన గొప్ప నాయకుడు జగన్మోహన్రెడ్డి అన్నారు. బుక్కాపురం, కిస్తీపురం పంచాయతీ పరిధిలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ప్రాంత ప్రజలుపడుతున్న ఇబ్బందులను స్వయంగా పర్యటించ డంతో సమస్యలను గుర్తించానన్నారు. రెండు పంచాయతీల్లో అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధుల మంజూరుకు జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి, ఇన్చార్జ్ మంత్రి అంబటిరాంబాబు ద్వారా కృషి చేస్తానన్నారు .ఆరవీటిపల్లి లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నియో జకవర్గ ప్రచార కార్యదర్శి శాంతకుమారి అందరిని ఆత్మీయంగా పలుకరిస్తూ, చిన్నారులతో ముచ్చటిస్తూ ప్రతి ఇంటికి వెళ్ళి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులను కోల్పోయిన శ్రీలక్ష్మి అనే పాపను చేరదీసి చాక్లేట్లు అందించారు. ఈపాపకు లక్ష రూపాయలను బ్యాంక్లో డిపాజిట్చేసి బాండ్ను త్వరలోనే వారి కుటుంబ సభ్యులకు అందిస్తామన్నారు. శ్రీలక్ష్మి ప్రతి పుట్టినరోజుకు కొత్తబట్టలు అంది స్తానన్నారు. శ్రీలక్ష్మికి ఎలాంటి అవసరం వచ్చినా కుటుంబసభ్యులు కానీ, గ్రామస్తులు కానీ తనకు తెలి య జేస్తే సాయమందిస్తానన్నారు. ఈ మెట్టప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖ ర్రెడ్డితోనే సాధ్యమ వుతుందన్నారు. ఈ ప్రాంతానికి తాగు,సాగునీరు అందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే తనవంతు ప్రయత్నాలు చేస్తు న్నారన్నారు.

ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాట్ల రమణారెడ్డి, మండల కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి, సొసైటీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, వింజమూరు సర్పంచ్ నల్లగొండ్ల సృజన, తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబు, ఎంపిడిఒ స్వరూపరాణి, నాయకులు అన్నపురెడ్డి శ్రీనివా సులురెడ్డి, నీలం సంజీవరెడ్డి, బయపురెడ్డి విజయకృష్ణారెడ్డి, మద్దూరి చిన్నికృష్ణారెడ్డి, చీమల హజరత్రెడ్డి, నల్లగంగు పెంచలరెడ్డి, దాట్ల కృష్ణారెడ్డి, దాట్ల వెంకటేశ్వర్లురెడ్డి, మండాది గోవిందరెడ్డి, భోజనపు గోపి, కాటేపల్లి ఎంపిటిసి సభ్యులు పల్లాపు పురుషోత్తం, ఊటుకూరు ఎంపిటిసి సభ్యులు గువ్వల మల్లిఖార్జున , గ్రామస్తులు పాల్గొన్నారు.

## అదాలత్లో పరిష్కారమయ్యే కేసులకు పూర్తిస్థాయిలో చట్టభద్రత



**కోవూరు, నవంబరు12 ప్రభాతవార్త :** కోవూరులోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ పూర్తిగా విజయవంతం అయింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సి. మురళీధర్ మాట్లాడుతూ పెండింగ్ కేసు పరిష్కారానికి కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన కాలాన్ని వృదా చేసుకోకుండా రాజీకి వీలు పడే కేసులన్నింటినీ ఈ లోక్ అదాలత్లో పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ లోక్ అదాలత్లో పరిష్కారమయ్యే కేసులకు పూర్తిస్థాయిలో చట్టభద్రత ఉంటుందని, ఈ విషయంలో కక్షిదారులు ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జుడీషియల్ ఫస్ట్క్లాస్ మెజిస్ట్రేట్ జె. కాత్యాయినీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, లోక్ అదాలత్ సభ్యులు ఉన్నారు.

## జగనన్న ఇళ్లల్లో అడుగడుగునా అవినీతే



**నెల్లూరు,నవంబరు12 ప్రభాతవార్త-విద్య** జనన్న నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇంచేందుకు ఏర్పా టుచేస్తున ్న కాలనీలు,ఇండ్ల నిర్మాణాల్లో అడుగడుగున్నా అవినీతి జరుగుతుందని జనేసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి అరోపించారు. జగనన్న ఇండ్లు పేదలకు కన్నీళ్లు పేరుతో జనసేన నిర్వహిస్తున్న డిజిట ల్ క్యాంపెయిన్ ప్రారంబోత్సవంలో భాగంగా ఆయన శనివారం నగరంలోని స్థానిక వెంకటేశ్వరపురం భగ న్సింగ్ కాలనీలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలోని ఇండ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతు ఎన్నికల ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి 60 వేల ఎకరాల్లో రాష్ట్రంలోని పేదలకు 28లక్షల ఇండ్లను ఏర్పాటుచేసి పంచుతామని హామీ ఇవ్వటం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఈ హామీని వైకాపా నాయకుల జోబులు నింపడానికి వినియోగింస్తున్నారని, అనేక ప్రాంతాల్లో జగనన్న కాలనీల నిర్మాణం కోసం స్థలాలలను అధికధరలకు వైకాపా నాయులు కొనుగోలు చేయంచటం జరిగిందన్నారు. మరి కొన్న చోట్ల వైకాపా కార్పోరేటర్లే కాంట్రాక్టర్స్ అవతారం ఎత్తి లబ్దిదారుల ఇండ్లను అత్యంత నాసికరం మెటీ రియల్తో నిర్మిస్తూ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. పేదలకు నిర్మిస్తున్న ఇండ్లు నిసిరకంతోనిర్మింటచం వలన భవిష్యత్లో ప్రమాదాలు సంభవిస్తే పేదలు ప్రాణాలు కోలో ్పవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. మరికొన్ని చోట్ల జగనన్న కాలనీల్లో ఆరు అడుగులమేర నీళ్లు నిలిచిపోయి ఈత కొలనుల్లా దర్శినమిస్తు న్నా యని ఎద్దేవా చేశారు. అనంతరం జనసేన నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్బాబు మాట్లాడుతు 28వేల ఇండ్లను నిర్మిష్తానన్న జగన్ ఈ జూన్లోపు 16లక్షల ఇండ్లను పూర్తిచేసి లబ్దిదారులకు ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలను మెసగించారని పేర్కొన్నారు. ఈ ఇండ్ల నిర్మాణంలో ఎటుచూసిన అవినీతి కనిపిస్తుందని ఆరో పించారు. నూతన ఇండ్ల నిర్మాణం పక్కనపెటిటే గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిక్కో ఇండ్లను కూడా లబ్దిదారులకు అందకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. తమ అధినేత ఆదేశాల ప్రకారం మూడు రోజులపాటూ జగనన్న ఇండ్ల నిర్మాణంలో జరుగుతున్న అవకతవకలను ప్రజలకు తెలియజేసేందుకు డిజిటల్ క్యాంపెయిన్ను నిర్వహిస్తున్నామన్నారు. రానున ్న రోజుల్లో వైకాపా ప్రభుత్వానికి ప్రభుత్వం తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. జిల్లా ప్రదానకార్యదర్శి గనుగుల కిషోర్, నాయకులు కోలా విజయ లక్ష్మి, షేక్.ఆలియా, సాయిమెహన్, ప్రశాంత్, అజయ్బాబు, పృధ్వీ, అలెక్, కస్తార్, వినయ్కుమార్, తదితరులు పాల్గొన్నారు.




రిపోర్టర్స్ కావలెను

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు నగరంలో... సంతపేట, దర్గామిట్ట, బారకాసు, కొండాపురం, మండలాలకు విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, ఎ.కె.నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, నెల్లూరు.
ఫోన్: 7675867756, 9347112031






## వేడుకగా కార్తీక మాస లక్ష దీపోత్సవం













